# బడికి వేళాయే...

- ముగిసిన వేసవి సెలవులు
- నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పునఃప్రారంభం
- పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థుల్లో ఉత్సాహం
- స్టేషనరీ దుకాణాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు సందడి




**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** వేసవి సెలవులు ముగియడంతో నేటినుంచి విద్యా సంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఆయా విద్యాసంస్థల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తిచేస్తుండగా... ప్రభుత్వ పాఠశాలల్లో గతవారం రోజులుగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే తమ పిల్లలకు తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలు డ్రెస్సులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్టేషనరీ దుకాణాల్లో సందడి నెలకొంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు గోదాములకు చేరుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ఇంగ్లీష్‌మీడియం మొదటగా 1నుంచి 8వతరగతి వరకు అమలు చేశారు. గతేడాది దానికి 9వతరగతి వరకు పొడిగించారు. ఈఏడాది దానిని 10వ తరగతి వరకు అమలు చేయనున్నారు. అయితే చాలావరకు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదు. దాంతో కొన్నస్కూళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు తగిన విధంగా లేవు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందిస్తున్న విషయం తెలిసిందే. పాఠ్యపుస్తకాలను ఆయా స్కూళ్లకు పంపించినా యూనిఫామ్స్ విషయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. యూనిఫామ్‌లు కుట్టే పని ఇంకా పూర్తి కాలేదని తెలుస్తుంది.

### గ్రేటర్‌లోనే విద్యార్థులు ఎక్కువ ..

గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిలాలల్లో 2,550 ప్రభుత్వ, 4667 ప్రవేట్ పాఠశాలలు ఉన్నాయి. 2023-24 గణాంకాల ప్రకారం మూడు జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో 19.96లక్షల మంది, సర్కార్ బడుల్లో 3,49, 787మంది చదువుతున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాతో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పదోతరగతిలో ఏటా ఉత్తీర్ణత శాతం తగ్గిపోతున్న పరిస్థితి కనిపిస్తుంది. సబ్జెక్ట్ టీచర్ల కొరత పాటు తెలుగు, ఇంగ్లీష్ సైతం బోధించే వారు కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

### ప్రవేట్ స్కూళ్లలో ఫీజుల బాదుడు ..

ఈఏడాది ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు భారీగా పెంచారు. గతేడాదితో పోలిస్తే కొన్ని 50శాతం, మరికొన్ని 25శాతం పెంచాయి. కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి కూడా రూ.2లక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. ఒక స్థాయి ఉన్న పాఠశాలల్లో ఫీజుల 1.5లక్షల కంటే ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్కూళ్లలో ఫీజుల బాదుడు ఎక్కువగా ఉంది. పుస్తకాలు, యూనిఫాం పేరిట భారీగా వసూలు చేస్తున్నారు. బ్యాగులు, బెల్టులు, టైలు కూడా తమ వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు.



హైదరాబాద్ వార్త

# కూకట్‌పల్లి జోన్‌పై ఎస్ఈ దృష్టి సారించేనా?

- అవినీతికి కేరాఫ్ జిహెచ్ఎంసీ డిఇ, ఎఇ కార్యాలయాలు
- రోడ్ల నాణ్యతకు తూట్లు..అధికారులకు నోట్లు..
- అక్రమార్కులకు రూ.కోట్లలో అక్రమాస్తులు..

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగం డీఇ, ఏఇ కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనకు నిలయాలుగా మారాయి. కొందరు డీఇలు, ఏఇలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ కూకట్‌పల్లి జోన ఎసీఈ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు ఇంజనీరింగ్ విభాగం అధికారులకు నగరం, శివార్లలో రూ.కోట్లలో అక్రమ ఆస్తులు ఉన్నట్లు తెలిసింది. అవినీతి నిరోధక శాఖ దృష్టిసారిస్తే అవినీతి తిమింగలాల అక్రమాస్తులు బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అభివృద్ధి పనుల్లో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పర్సెంటేజీలు ఇవ్వాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లు కూడా చేసేది ఏమిలేక అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్, ఆల్విన్ కాలనీ, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. కొందరు డీఇలు, ఏఇలు జేబులు నింపుకోవడంలోనే ధ్యాస తప్ప అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాల విషయంలో దృష్టి సారించకుండా కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకే పరిమితం అయ్యారనే ఆరోపనలు ఉన్నాయి. రోడ్లు వేసిన కొన్ని నెలలకే కంకర, గుంతలు తేలి నామరూపాలు లేకుండా పోతున్నాయి. నాణ్యత ప్రమాణాలతో నిర్మించాల్సిన రోడ్లు అందుకు విరుద్ధంగా వేస్తుండడంతో వేసిన కొన్నాళ్ళకే గుంతలు తేలి కొందరి అధికారుల అవినీతిని ఎత్తిచూపుతున్నాయి. కొత్తగా నిర్మించిన రోడ్లు కొన్ని నెలల్లోనే పాడైపోయిన వీటిని చూస్తుంటే అక్రమాలు ఏ మేర జరుగుతున్నాయో అర్థమవుతుంది. గ్రేటర్ నిధుల్ని ఇంజనీరింగ్ విభాగంలోని ఉన్నతాధికారులతోపాటు డీఇలు, ఏఇలు గుత్తేదారులు కుమ్మక్కై పెద్దఎత్తున దిగమింగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఏఇలు, వర్క్‌ఇన్స్‌పెక్టర్లతో అధికారులు కాంట్రాక్టర్ల నుంచి పెద్దమొత్తంలో మామూళ్ళను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి. కమీషన్లు భారీ ఎత్తున ముట్టుతుండడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రతి యేటా జనాభా పెరుగుతూ ఉంది. వలసలు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతుంది. ఈ క్రమంలో వాహనాల రద్దీ కూడా పెరుగుతుంది. ఏదైనా రోడ్డు నిర్మాణం చేయాలంటే ఆప్రాంతంలో వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయాలి. ప్రతిపాదనల్లో కంకర ఎంత మందం, సిమెంట్ తదితర వాటిని ప్రత్యేకంగా రూపొందించాల్సి ఉంటుంది. ఇవన్నీ నిబంధనలకే పరిమితం అయ్యాయి. ఈ విషయంలో డీఇలు, ఏఇలు పర్యవేక్షణను గాలికి వదిలేయడం వల్లే కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమకు చిత్తం వచ్చిన విధంగా రోడ్లను వేసి చేతులు దులుపుకుంటున్నారు. గుంతల రోడ్ల కారణంగా వాహనాలు త్వరగా పాడైపోవడమే కాకుండా తీవ్రమైన దుమ్ము, దూళితో వాహనదారుల ఆరోగ్యం పాడవుతోంది. ఇక నాణ్యతను పరిశీలించాల్సిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత గల రోడ్లు ఎక్కడ కనిపించడంలేదు. ఇంజనీరింగ్ విభాగం అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ల అలసత్వం వెరసి కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అవుతోంది. అనేక ప్రాంతాల్లో గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో రోడ్లు ధ్వంసమయ్యాయి. అప్పటికే అద్వాన్నంగా ఉన్న రోడ్లు వర్షాలతో మరింత ప్రమాదరకరంగా మారాయి. ఇదిలా ఉండగా అధికారుల అవినీతి, కాంట్రాకర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణం సాఫీగా సాగేలా ఉన్న రోడ్లను సైతం అడ్డగోలుగా తవ్వుతూ మళ్ళీ రోడ్లు వేస్తూ నిధుల హారతి కర్పూరంలా ఖర్చుచేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బాగున్న రోడ్లనే తవ్వి పోస్తున్నారు. అంత కంటే బాగా లేని వాటిని మాత్రం పట్టించుకోవడం లేదు. అవకాశం ఉన్న ప్రతిచోటా నిధులు ధారపోస్తూ బాగున్న రోడ్లను ఇంకా బాగుచేస్తున్నారు. నిధుల మేతకు అలవాటుపడ్డ కొందరు అధికారులు ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు అవకాశం వచ్చిందే తడవుగా తమ ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేస్తున్నారు. ఇంజనీరింగ్ నియమ నిబంధనల్ని అమలు చేయకపోవడం వల్ల జిహెచ్ఎంసి రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కొందరు డీఇలు, ఏఇలు అక్రమాలకు పాల్పడుతు రూ.కోట్ల ఆస్తుల్ని పోగేసుకుంటూ జిహెచ్ఎంసిని దివాళా తీయిస్తున్నారు.

# గతమెంతో ఘనం




**పంజాగుట్ట జూన్ 11,( ప్రభాతవార్త)** దక్షిణ భారతదేశంలోనే వైద్యరంగంలో పేరుగాంచిన నిజాం వైద్యశాల నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే సంకల్పంతో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యంత్రి నందమూరి తారక రామారావు అత్యాధునిక పరికరాలను ఆసుపత్రికి సమకూర్చడం జరిగింది. దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుగునాట నుండే కాకుండా బంగ్లాదేశ్, పాకిస్థాన్ వంటి దేశాలనుండి కూడా రోగులు ఎంతో నమ్మకంతో ఇక్కడకు వచ్చి తమ ఆరోగ్యాలను మెరుగుపరుచుకుంటుంటారు. పైసా ఖర్చు లేకుండా నిరుపేదలకు వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అవయవ మార్పిడి వంటి కీలకమైన ఆపరేషన్‌లు సైతం అవలీలగా చేసిన ఘనత నిమ్స్ కే సొంతం. కానీ పాలనా పరమైన వైఫల్యాల వల్ల వైద్యులు, రోగులు అనేక రకాలుగా ఇక్కట్లకు గురవుతున్నారు. క్లిష్టతరమైన చికిత్స అందించే ఈ ఎమ్ సీలో సైతం ఏసీలు సరిగా పనిచేయక పోవడం, కాలం చెల్లిన ఏసీల నిర్వహణ లోపభుయిష్టంగా ఉండడం, మరోపక్క వైద్యులు మూకుమ్మడిగాబయటకు వెళ్ళడం వంట సంఘటనలు ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో నిమ్స్ కు నరాల వీక్‌నెస్ చందంగా తయారైంది. వాస్తవానికి నిమ్స్ అంటే ఆర్థోపెడిక్, న్యూరాలజీ విభాగాలే ప్రాధాన్యత. అలాంటి న్యూరాలజీ విభాగంలో ఒక యూనిట్ మొత్తం వెళ్ళిపోవడమే కాకుండా ఓ అనుభవం కలిగిన న్యూరోసర్జిన్, ఓ న్యూరాలజిస్ట్ వెళ్ళిపోవడం యాజమాన్య వైఫల్యానికి పరాకాష్టగా చెప్పక తప్పదు. ఉన్న వారికి పనిభారం ఎక్కువ కావడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపైనే నిమ్స్ చాలావరకు ఆధారపడి నడుస్తోంది. దశాబ్దాల తరబడి నియామకాలు లేకపోడంఉన్నవారికి పనిభారం ఎక్కువైపోతుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణచేసిన వారిస్థానంలో సరైన అర్హతలు ఉన్నవారిని నియమించుకోకపోవడం కూడా ఇబ్బందులకు ఒక కారణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ సిబ్బందిని తీసుకోవడానికి కాంట్రాక్ట్ పద్దతిలో ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చినా , అర్హులైన వారు వచ్చినా కుంటిసాకులు చెప్పి కొంతమందినే తీసుకున్నారని రని పలువురు ఉద్యోగులు భహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మెయిన్ బిల్డింగ్‌లో మూడు షిఫ్ట్‌లతో సిబ్బంది పనిచేయాలి, కానీ సిబ్బంది కొరతతో పని విభజన చేయడం లేదని అక్కడి ఉద్యోగులు వాపోతున్నారు. ఓపీ కౌంటర్లను డివైడ్ చేసినట్లే బిల్లింగ్ కౌంటర్‌లను కూడా చేస్తే కొంత మేర పనిభారం తగ్గుతుందని, తద్వారా రోగులకు కూడా సమయం కలసి వస్తుందని ఓ ఉద్యోగి అభిప్రాయపడ్డారు. ఇదే కాక డంపింగ్ యార్డు కూడా చెత్త కుప్పగా మారిందని సరైన పర్యవేక్షణ లోపించిందని పలువురు అంటున్నారు. ఇక నిమ్స్ కు నిత్యం వేలాదిగా రోగులు, వవారి బధువులు రాకపోకలు సాగిస్తుంటారు. టూవీలర్ ఆపితే 20 రూపాయలు, ఫోర్ వీలర్ ఆపితే 80 రూపాయలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డెయిరీలో వేడిపాలు రాత్రిసమయాలలో అందుబాటులో ఉండాలి. దానికోసం ఏర్పాటు చేసిన డెయిరీ వ్యాపార స్వలాభాలు చూసుకుని సరైనవి అందించడంలేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. ఉన్నతాధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఉద్యోగులు భాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యం కలగా మిగల కూడదనే ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ఇపుడు ఈ విధంగా గాడి తప్పడం పట్ల ఓ సీనియర్ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేస్తూ గత వైభవాన్ని గుర్తు చేసుకుని కన్నీళ్ళు పెట్టుకుని మరీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబద్ధత గల ఉద్యోగులు, సేవా భావంతో పనిచేసే ఎంతో నైపుణ్యం గల వైద్యులు తమ నైపుణ్యాన్ని పణంగా పెట్టి మరీ రోగులకు సేవ చేస్తున్నారు. సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఉద్యోగులతో పాటు పలువురు రోగులు కూడా ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ఇకనైనా నిమ్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమూలమైన మార్పులు చేయడమే కాక, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ఉన్నతాధికారులు అహం వీడేలా ప్రభుత్వం చ్యలు తీసుకోకపోతే నిమ్స్ను ఆ దేవుడు కూడా కాపాడలేరనేది భహిరంగ సత్యం...

# సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో నిందితురాలు



**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మరోసారి గంజాయి పట్టుబడింది. మంగళవారం పోలీసులు చేస్తున్న తనిఖీల్లో భాగంగా మహారాష్ట్రకు చెందిన సునీత అనే మహిళ వద్ద పదుల సంఖ్యలో కొరియర్ పార్శిళ్ళు ఉన్నాయి. అనుమానించిన పోలీసులు వాటిని తెరిచి చూడగా భారీగా గంజాయి బయట పడింది. దాంతో ఆమెను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి మొత్తం 20 కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీని విలువ దాదాపు రూ.5 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు. ఇటీవలె స్టేషన్‌లోని తమ తనిఖీల్లో భాగంగా 27 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు సీజ్ చేసిన ఘటన తెలిసిందే. అయితే నిందితులు దొరికిపోతామనే భయంతో గంజాయితో నిండిన ట్రాలీ సూట్‌కేసు వదిలేసి పరారయ్యారు. ఇది జరిగి వారం తిరక్కుండానే 20 కిలోల గంజాయిని నిందితురాలు తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలు మహారాష్ట్ర నుంచి గంజాయిని ఎవరికి చేర్చడానికి నగరానికి తీసుకువచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# కన్నులపండువగా శ్రీవేంకటేశ్వరస్వామి పంచదశ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో ఎస్‌బిహెచ్ కాలనీ వద్ద గాంధీనగర్‌లో ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో వారంరోజులపాటు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పంచదశ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ నెల 14 శుక్రవారం నుండి 19 బుధవారం వరకు వైభవోపేతంగా జరుగనున్న ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి జరిపే విశేష కైంకర్యములలో 14 శుక్రవారం రాత్రి 6 గంటల నుండి ప్రబంధ పారాయణము; 15 శనివారం ఉదయం 7గంటల నుండి సేవాకాలం, రాత్రి 7గంటల నుండి పరమ పదోత్సవము; 16 ఆదివారం ఉదయం 8గంటల నుండి ఉత్సవారంభ స్నపనం, నూత్తందాది, చాత్మర, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, చతుస్థావర్చన, ద్వజాదిహోమం, ధ్వజారోహణం; రాత్రి 7గంటల నుండి నిత్యహోమము, బేరీపూజ, దేవతాహ్వానము, నిత్యపారాయణాదుల ప్రారంభం; 17 సోమవారం ఉదయం 9గంటల నుండి నిత్యహోమము, శ్రీలక్ష్మీ సుదర్శన యాగము, ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 7 గంటల నుండి నిత్యహోమము, రథోత్సవము, శ్రీవారి కళ్యాణోత్సవం; 18 మంగళవారం ఉదయం 9గంటల నుండి మహాపూర్ణాహుతి, చక్రస్నానము, కుంభప్రోక్షణ, సాయంత్రం 5గంటల నుండి పుష్పయాగము, ద్వాదశారాధన, దేవతోదద్వాసన, ధ్వరావరోహణం, రాత్రి 8గంటల నుండి దోలోత్సవం, బ్రహ్మోత్సవ పరిసమాప్తి, పండిత సన్మానము, వేద ఆశీర్వచము; 19 బుధవారం ఉదయం 8గంటల నుండి శతఘటాభిషేకం ఇత్యాధి పూజా కార్యక్రమాలు నిర్వహించబతాయని, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా స్వామివారి విశేష కైంకర్య పూజాది కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపకు పాత్రులు కావాలని కార్యనిర్వహణాధికారి, ఆలయ కమిటీ కోరింది.

# నగరంలో దంచి కొట్టిన వర్షం...పలుచోట్ల ట్రాఫిక్ జామ్





**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త** నగరంలో వర్షం దంచి కొట్టింది. మంగళవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఏకదాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీటమునగగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. నగరంలోని మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి, దుండిగల్, గండిమైసమ్మ, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, ఎల్బీనగర్, నాగోల్, వనస్థలిపురం, మన్సూరాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బోయిన్‌పల్లి, మారేడుపల్లి, బేగంపేట, ప్యారడైజ్ ప్రాంతాల్లో పాటు చిలకలగూడ, అల్వాల్, కాప్రా, దమ్మాయిగూడ, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్, జవహర్‌నగర్, బోడుప్పల్, రామంతాపూర్, ఎల్‌బినగర్, కొంపల్లి, జీడిమెట్ల, దుండిగల్, జగద్గిరిగుట్ట, నిజాంపేట్, మియాపూర్, బేగంపేట్, ముషీరాబాద్, అంబర్‌పేట, ఫిలింనగర్, చిక్కడపల్లి, ముషీరాబాద్, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, ఖైరతాబాద్, పంజాగుట్ట, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో వాన జోరుగా కురిసింది. వనస్థలిపురంలో జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరింది. చింతల్‌కుంట వద్ద వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. పనామా-ఎల్బీనగర్ మధ్య వాహనాలు స్తంభించిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షంతో రోడ్లపై వాహనదారులు అవస్థలు పడ్డారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈదురుగాలుల వల్ల ముందున్నది కనిపించక వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. రోడ్లపై నీరు నిల్వడంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రహదారులు జలమయం కాగా డ్రైనేజీలు పొంగిపోర్లాయి. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాదాపు అన్ని మార్గాల్లోనూ ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వందలాది వాహనాలు ఆగిపోయాయి. వర్షంతో విద్యుత్ సరఫరా బంద్ అయ్యింది. పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. ఈదురుగాలి తీవ్రతకు రోడ్లపై ఉన్న చిన్న చిన్న దుకాణాలపై ఉన్న కవర్లు ఎగిరిపోయాయి. మరోవైపు మూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. జిహెచ్ఎంసి సిబ్బంది చేరుకుని రహదారిపై పడిన చెట్లను తొలగించారు. వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి అధికారులు కూడా సూచనలు జారీ చేశారు.



# మణికొండలో కారు బీభత్సం


- పార్కింగ్ చేసిన 20.కార్లను ఢీకొన్న కారు
- కారును వెంబడించి పట్టుకున్న కాలనీ వాసులు
- మైనర్ కారు నడిపినట్లు తేల్చిన పోలీసులు




మణికొండలో మైనర్ నడిపిన బెలెనో కారు ఇదే.

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ వద్ద సోమవారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ముందుగా ఓ ద్విచక్రవాహనంను ఢీకొనడంతో వారు కిందపడి స్వల్పంగా గాయాలపాలయ్యారు. కారు ఆపకుండా ముందు పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు సుమారు 20.ని ఢీకొంటూ వేగంగా వెళ్లింది. స్థానిక కాలనీ వాసులు ఆ కారును వెంబడించి కారు తోలిన మైనర్ బాలుడిని పట్టుకున్నారు. అనంతరం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మణికొండ మున్సిపల్ పరిధిలోని నెక్‌నాంపూర్ గ్రామానికి చెందిన 14.ఏళ్ల బాలుడు తమ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బెలెనో కారు(ఆటోమెటిక్)ను తీసుకొని మణికొండ మేయిన్ రోడ్డు వైపుకు వచ్చాడు. ఇతడికి కారు నడుపడం రాదు. డ్రైవింగ్ లైసెన్సు లేదు. అయినా కారును తీసుకొని రోడ్డుపైకి వచ్చి బీభత్సం చేశాడు. ముందుగా ఓ బైక్‌ను ఢీకొనడంతో వారు కిందపడ్డారు. వారు లేచి వచ్చి తనను పట్టుకొంటారన్న ఆత్రుతతో వేగంగా కారు తోలి ముందు పార్కింగ్ చేసిన వాహనాలన్నింటిని ఢీకొంటూ వేగంగా ఇంటికి చేరుకున్నాడు. స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు కారును సీజ్ చేశామని, బాలుడిపై, అతడి తండ్రిపై కూడా కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

# రౌడీషీటర్ హత్య కేసును ఛేదించిన మీర్‌పేట్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న వనస్థలిపురం ఎసిపి కృష్ణయ్య

**సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో సంచలనం సృష్టించిన రౌడీషీటర్ దారుణ హత్యోదంతం కేసు మిష్టరీని మీర్‌పేట్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు పథకం ప్రకారం రౌడీషీటర్‌ను అంతమొందించిన నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు పంపారు. మంగళవారం మధ్యాహ్నం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో వనస్థలిపురం ఎసిపి కృష్ణయ్య మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాథ్, డిఐ గౌరీ నాయుడు, ఎస్ఐ సుధాకర్, సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గత శుక్రవారం అర్థరాత్రి నందనవనంకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ సల్మాన్ (25) దారుణ హత్యకు గురైన నేపథ్యంలో రంగంలో దిగిన మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసి దరా ్యప్తును వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం దారుణానికి ఒడిగట్టింది భైరామల్‌గూడకు చెందిన దాసరి సురేందర్ అలియాస్ సూరి (29), మల్లాపూర్ కుర్మల్‌గూడకు చెందిన మంచాల స్వర్ణలత (25), సరూర్‌నగర్ పోచమ్మబాగ్‌కు చెందిన బొర్ర అరుణ్ కుమార్ (24), కొత్తపేట్ గోకుల్ నగర్‌కు చెందిన దుగాని లక్ష్మణ్ (25), తలకొండపల్లి హరియానాయక్ తాండాకు చెందిన కేతావత్ అరుణ్ (21)గా తేల్చారు. సల్మాన్ సోదరిని మతాంతర వివాహం చేసుకొని తర్వాత హత్య చేసిన సురేందర్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. సల్మాన్ తనను అంతమొందిస్తాడని అభద్రతా భావానికి గురైన సురేందర్ పథకం ప్రకారం మిగిలిప నిందితులతో కలిసి సల్మాన్‌ను కర్మన్‌ఘాట్ రింగ్‌రోడ్డులోని అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద నిర్మానుష్య ప్రదేశానికి రప్పించి పాశవికంగా కత్తులతో పొడిచి హత్య చేశాడు. అయితే కేసు నమోదు చేసి రంగంలో దిగిన ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాథ్ బృందం దర్యాప్తు జరిపి నిందితులను అదుపులోకి తీసుకుంది. ఈ మేరకు హత్యకు ఉపయోగించిన కత్తులతో పాటు నిందితులు వాడిన మోటార్ సైకిళ్ళను సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వారిని కోర్టుకు రిమాండ్ చేశారు. అయితే హత్య కేసులో చాకచక్యంగా వ్యవహరించి మిష్టరీని ఛేదించిన ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాథ్, డిఐ గౌరీ నాయుడు, ఎస్ఐలు గోవింద్ స్వామి, సుధాకర్, సిబ్బందిని ఎసిపి అభినందించారు.

## ఉస్మానియా ఆసుపత్రికి అడ్వాన్స్‌డ్ అంబులెన్స్‌ను బహూకరించిన మిధాని



అంబులెన్స్‌ను అందజేస్తున్న మిధాని ఛైర్మన్ డాక్టర్ ఎస్.కె.ఝూ

సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త : కేంద్ర రక్షణ సంస్థ మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఉస్మానియా ఆసుపత్రికి అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ సదుపాయం కలిగిన అంబులెన్స్‌ను ఉచితంగా అందజేసింది. మిధాని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఝూ, డైరెక్టర్(ఫైనాన్స్) గౌరీ శంకర్‌రావు, డైరెక్టర్(ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్) టి.ముత్తు కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేంద్ర, జనరల్ మేనేజర్ ఎ.రామకృష్ణారావుల సమక్షంలో రూ.31 లక్షల విలువైన ఈ అంబులెన్స్‌ను ఉస్మానియా ఆసుపత్రికి అందజేశారు. కోవిడ్ సమయంలో కోటి రూపాయల విలువైన ఆక్సిజన్ జనరేటర్ ప్లాంట్‌ను ఉస్మానియా ఆసుపత్రికి మిధాని అందజేయడం జరిగిందని డాక్టర్ ఎస్.కె. ఝూ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించాలి : బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



కలెక్టర్‌ను కోరుతున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త: పేద, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు తమ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు సందర్శించరని ప్రశ్నించారు. కలెక్టర్ లాంటి అత్యున్నత అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తే పాఠశాలల స్థితి గతులతోపాటు, రూపురేఖలే మారతాయన్నారు. ప్రతి ప్రాంతంలో గుడులను అభివృద్ధి చేసే వారు ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పట్టించుకోరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుడికి ఇచ్చినట్లే పాఠశాలలకు విరాళం ఇస్తే భవిష్యత్తులో క్రమంగా పేదరికం నిర్మూలన జరుగుతుందని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనీ అదే విధంగా ప్రతి రోజు పారిశుధ్య సిబ్బందిచే పరిశుభ్రం చేయించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యంగా ప్రతి పాఠశాలకు అటెండర్ ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## పాడి రైతులతో పాటు కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం : ఛైర్మన్ శ్రీకర్‌రెడ్డి



పర్మినెంట్ ఆర్డర్‌ను అందిస్తున్న ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు

హయత్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త: పాడి రైతులతో పాటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని మదర్ డెయిరీ ఛైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తెలిపారు. హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కేంద్ర కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని పాల శీతలీకరణ కేంద్రాలలో పనిచేస్తున్న 181మంది ఉద్యోగులకు పదోన్నతులను కల్పించడంతోపాటు 238మంది అసైన్‌మెంట్ పద్ధతిన పని చేస్తున్న కన్సాలిడేటెట్ సిబ్బందిని రెగ్యులర్ చేశారు. దీనికి సంబంధించిన ఆర్డర్లను వారు మంగళవారం సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటి వరకు పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఎనిమిదేళ్లుగా పదోన్నతులు కల్పించలేదని, 15 నుంచి 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ పద్ధతిన పనిచేస్తున్న వారికి కూడా న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో గత పాలకవర్గ సమావేశంలో పదోన్నతులు, రెగ్యులర్ అంశాలపై పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో ఎలాంటి ఒత్తిడిలు, అవకతవకలు లేవని పూర్తి పారదర్శకంగా పదోన్నతులు, పర్మినెంట్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి ఒకింత ఆందోళన కరంగానే ఉన్నా... కార్మికుల జీవనం, వారికి పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకుని పాలకవర్గం ఈమేరకు నిర్ణయం తీసుకుందన్నారు. సంస్థలో ప్రతి నిర్ణయం పాలకవర్గం ఆమోదంతోనే తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆర్డర్లు పొందిన కార్మికులు ఛైర్మన్, పాలకవర్గ సభ్యులను శాలువాతో సత్కరించారు. అనంతరం టపాసులు కాల్చారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు చింతలపుడి వెంకట్రామిరెడ్డి, పిరంగి వెంకట్రామిరెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి, కస్తూరిపాండు, జాలరాంరెడ్డి, కందాల అలివేలురంగారెడ్డి, సంస్థ ఎండీ బి.కృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయించండి : మేయర్ పారిజాత



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ చిగిరింత పారిజాత

సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో ఎలాంటి మరమ్మతు పనులు ఉన్నా వాటిని చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని ఆమె పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలల్లో బోరు మోటార్లు, ఎలక్ట్రికల్‌కు సంబంధించిన రిపేర్లు ఏమైనా ఉంటే వాటిని తక్షణం చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మండల విద్యాధికారి కృష్ణయ్య, డిఇఇ జ్యోతిరెడ్డి, ఎఇఇ వినీల్‌గౌడ్, పలువురు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



దేవాలయాన్ని సందర్శించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
చిత్రంలో కొప్పుల దినేష్, సురేందర్‌రెడ్డి తదితరులు

మలక్‌పేట, జూన్ 11 ప్రభాతవార్త : ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ తదితరులతో కలిసి నాగర్‌కర్నూల్‌లోని వట్టెం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఆలయ నిర్వాహకులు మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా, గార్లపాటి జితేందర్, మడిగెల లక్ష్మారెడ్డి, ఆవుల ప్రవీణ్‌కుమార్, జక్క మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవులు లేకుంటే మానవాళి మనుగడ లేదు



విలేకరులతో మాట్లాడుతున్న ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ

సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త: గోవులులేకుంటే భూమిపై మానవాళి మనుగడ లేదని అఖిల భారత గో సేవా ఫౌండేషర్ అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. గోవు అనేది కేవలం జీవి కాదని అది తమ ప్రాణమని అన్నారు. గోవుల అక్రమ రవాణా ఎక్కడ జరిగినా సమీపంలోని పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. గోవుల రక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలు కావడం లేదని, వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్, మాణిక్‌యాదవ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి : కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి




జడ్‌సి పంకజకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 11 ప్రభాతవార్త : జిహెచ్‌ఎంసి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజను మర్యాదపూర్వకంగా బి.యన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రోడ్లు, పార్కులు, కాలనీ సంక్షేమ సంఘం భవనాలు, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేసి, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పేర్కొన్నారు.

## మధురానగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త: అల్మాస్‌గూడ మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏమిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల తిరుపతయ్యయాదవ్, కోశాధికారిగా శిరందాసు వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా సత్తయ్య, రామారావు, పురుషోత్తంరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్‌రావు, ముఖ్య సలహాదారునిగా గార్లపాటి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జహంగీర్, మధుచారి, రాహుల్ శర్మ, శ్రీశైలం యాదవ్, లక్ష్మీకాంతరావు, విజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, దినేష్‌రెడ్డి, సైదులు గౌడ్, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన వారిని అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు.

## జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఖాళీ భవనాలను పాఠశాలకు, ఆరోగ్య కేంద్రానికి కేటాయించాలి

సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడ జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న భవనాలను ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడి కేంద్రం కోసం కేటాయించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కోరారు. ఈ మేరకు ఆమె ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న భవనాల్లో వాటిని ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంనుండి అక్కడ ఏర్పాటు చేసే పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యేలా చూడాలనీ అదే విధంగా ఆరోగ్య కేంద్రం కూడా నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఉప్పల

ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో షిరిడిసాయి అష్టంగా యోగ శిక్షణ తరగతులు జూన్ 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శిక్షణ తరగతుల బ్రోచర్‌ను టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్త నాగోలు ఉప్పల కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శ్రీషిరిడిసాయి అష్టాంగ యోగ గురు నిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల విజ్ఞప్తి చేశారు. గత 20 సంవత్సరాలుగా చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయని ప్రస్తుత కాలంలో అనారోగ్యాల నుంచి ఆరోగ్యం తెచ్చుకోవడానికి యోగా చక్కటి రాజమార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్, నరేందర్, గురూజీ శ్రీరాములుగౌడ్, అర్జున్, యోగ ప్రచారక్ ఉపేందర్ గౌడ్, చంద్రశేఖర్, విఠలాచారి గురూజీ తదితరులు పాల్గొన్నారు.

## తలసానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ

ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త : మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ పార్థీవదేహాన్ని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తలసాని కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని, తలసాని శంకర్ యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. తలసాని కుటుంబంతో తనకు ఎంతో పరిచయం ఉందని, శంకర్‌యాదవ్ కుటుంబానికి మరింత ధైర్యం ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత బండారి నీలంరెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలి : ఎమ్మెల్యే బలాల



అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

మలక్‌పేట, జూన్ 11 ప్రభాతవార్త : పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన జిహెచ్‌ఎంసి అధికారులతో ఎమ్మెల్యే బలాల సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు అంశాల గురించి చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నాలాల పూడిక తీత పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడడానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలం షాహిద్, మినాజుద్దీన్, నాయకులు అబ్రార్, సైపుద్దీన్ షఫీ, అలీం, ఇఇ పీర్‌సింగ్, డిఇ బన్సీలాల్, ఎఇలు మల్లికార్జున్, రఘువీర్ ప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యాంగిర అమ్మవారికి ముక్కెర ప్రధానం



శ్రీనివాస్‌కు ముక్కెర అందజేస్తున్న ఉదయలక్ష్మి, ఇన్‌సెట్లో ముక్కెర

ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారికి ఉదయలక్ష్మి అనే భక్తురాలు వజ్రంతో కూడిన ముక్కెరను సమర్పించారు. దేవాలయం సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులకు ఆమె ముక్కెరను అందజేశారు. అమ్మవారు చాలా మహిమగల దేవతని, ఎటువంటి సమస్యలున్నా అమ్మవారికి హోమం చేస్తే సమస్యలు తొలగిపోతాయని ఉదయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్‌సువర్ణలత దంపతులు ఉదయలక్ష్మికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విటల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ, హేమ, రామశర్మ, శ్రీపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిజెపిదే అధికారం



బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌ను భాగ్యనగర్ జిల్లాబిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు కేంద్ర క్యాబినెట్‌లో రెండు మంత్రి పదవులు దక్కడం హర్షణీయమన్నారు. తెలంగాణాకు బిజెపి అధిష్టానం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

## మోహన్‌బాబుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ



మోహన్‌బాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ ఆర్‌టిసి కాలనీకి చెందిన బిఆర్ఎస్ నేత మోహన్‌బాబు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మోహన్‌బాబుకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు తగు చేయూత అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, పసుల ప్రభాకర్‌రెడ్డి, బోసాని పవన్, సురేష్, మల్లికార్జున్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలి : డిప్యూటీ మేయర్ శ్రీలత



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త : వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డి సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుభాష్, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ హేమలతతో పాటు ఇంజనీరింగ్ అధికారులతో వారు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యుత్ తీగలు సమస్యలు పరిష్కరించాలని, వీధి దీపాలు చెట్లకు కప్పేయకుండా చూడాలని సూచించారు. నిభందనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించే నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్పందించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆశాలత, జలమండలి డీజీఎం సరిత, హర్టికల్చర్ మేనేజర్ గణేష్, ఏఈ వెంకటేష్, జలమండలి మేనేజర్లు నిఖితా రెడ్డి, కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన : సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, జూన్ 11 ప్రభాతవార్త : ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ నందు అధికారులచే కలిసి రెయిన్ వాటర్ పైప్ లైన్ పనులను, కొత్తగా నిర్మించే రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికి సాయిరాంనగర్, శ్రీనివాసకాలనీల నుంచి వర్షపునీరు ఈ కాలనీ మధ్యలో చేరి కాలనీలోకి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. వర్షపునీరు వెళ్లడానికి నూతనంగా పైప్ లైన్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నూతనంగా రోడ్డు మంజూరు చేయించడం జరిగిందని ఈ రోడ్డు విషయంలో అధికారులు సరైన ఎత్తుపల్లాలు చూసుకొని రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, అధికారులు రఫీ, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు

ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త: కొత్తపేట గ్రామంలో వంద మీటర్ల డ్రైనేజీ లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. జలమండలి అధికారులతో కలిసి కొత్తపేటలోని డ్రైనేజీలైన్ పనులను కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట డివిజన్ పరిధిలో మంజూరి అయిన డ్రైనేజ్‌లైన్ పనులు వెంటనే ప్రారంభించి పనులు పూర్తి చేయాలని అన్నారు. పాత డ్రైనేజ్‌లైన్ వ్యవస్థ సరిగ్గా లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీలైన్ పనులను పూర్తి చేయాలని, పనులు పూర్తి అయినా వెంటనే సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇంచార్జి అరైఫ్, సూపర్వైజర్ దయాకర్, సత్యనారాయణ, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవ ఎన్నిక



సహకార బ్యాంక్ ఛైర్మన్ సత్తయ్యను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు


తుర్కయంజాల్, జూన్ 11 ప్రభాతవార్త : రాష్ట్ర సహకార బ్యాంకు వైస్‌ఛైర్మన్‌గా రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో గల ఆయన నివాసానికి వెళ్లిన కౌన్సిలర్లు నాయకులు ఘనంగా సన్మాన ఏర్పాటు చేయడం జరిగింది.. సత్తయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై నమ్మకంతో రాష్ట్ర సహకార బ్యాంకు వైస్‌ఛైర్మన్‌గా నియమించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అదేవిదంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర సహకార సంఘాల అభివృద్ధికి ఛైర్మన్ రవీందర్‌రావుతో కలిసి పని చేస్తానని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొక్క రవీందర్ రెడ్డి, పుల్లగుర్రం విజయనంద్‌రెడ్డి, మేతరి దర్శన్ , మేతరి అశోక్, చెవుల దశరథం, గుండా ధనరాజ్,శ్రీనివాస్, చందు, జొన్నాడ సుదర్శన్ రెడ్డి,కడారి పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో సదుపాయాల కల్పన



వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రాదజమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటి సమావేశం మంగళవారం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. వైద్యాధికారి డా.సౌందర్యలత ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఫ్రభుత్వం ద్వారా రూ.30వేల నిధులు వచ్చాయని, వీటితో మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ప్యాన్లు, కుర్చీలు, తలుపులు సరిగ్గా లేవని, వీటిని మెరుగుపర్చాలని వైద్యాధికారి డా.సౌందర్యలత సూచించారు. దీనిపై కార్పొరేటర్ బన్నాల గీత స్పందిస్తూ కుర్చీలు, ఫ్యాన్లు, తలుపులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. అత్యవసర పనులకు తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌందర్యలత, కరుణాదేవి, సూపర్‌వైజర్ బోగ ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు (ప్రభాతవార్త, మలక్‌పేట)